పొలాలకు వెళ్లేదెలా?


తనగల సమీపంలో డీ-23 వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప వంతెన

- ఆర్డీఎస్ కెనాల్‌పై పొలాలకు తాత్కాలిక దారులు
- శిథిలావస్థకు చేరిన ఇనుప ఛానళ్లు
- కెనాల్ అవతలివైపు పొలాలకు వెళ్లలేని పరిస్థితి
- కల్వర్టులు నిర్మించాలని కోరుతున్న రైతులు

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ ఏర్పాటుతో పంటలు పండించుకోవచ్చని సంతోష పడాలో, పొలాలకు వెళ్లేందుకు దారిలేక బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొంది. 140 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న ఆర్డీఎస్ కెనాల్‌పై కొన్నిచోట్ల మాత్రం చిన్నపాటి కల్వర్టులు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల తాత్కాలిక ఇనుప ఛానళ్లు ఏర్పాటు చేసి వాటిపై ఇనుప రేకులు వెల్డింగ్ చేయించి కాలినడకన రైతులు, కూలీలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేశారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప ఛానళ్లు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. నడవడానికి ఏర్పాటు చేసిన ఇనుప రేకులు తుప్పుపట్టి కాల్వలో పడిపోయాయి. దీంతో మూడించుల మేర ఉన్న ఇనుప ఛానళ్లపై రైతులు, కూలీలు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలంలో ప్రవహించే ఆర్డీఎస్ కెనాల్‌పై డీ-23, డీ25లో నాలుగు చోట్ల పొలాలకు వెళ్లడానికి దశాబ్దాల క్రితం తాత్కాలిక ఇనుప వంతెనలు ఏర్పాట్లు చేశారు. వడ్డేపల్లి మండల రైతుల పొలాల మధ్య ఆర్డీఎస్ ప్రధాన కాల్వ తవ్వడంతో అవలి వైపున ఉన్న పొలాలకు కాలినడకన వెళ్లేందుకు తాత్కాలిక ఇనుప వంతెనలు సహాయపడేవి. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప ఛానళ్లు తుప్పుపట్టి మట్టిలో కలిసిపోయాయి. ఇనుప రేకులు 80శాతం వరకు తుప్పుపట్టి కెనాల్‌లోని నీటిలో పడిపోయి కొట్టుకుపోయాయి. దీంతో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

4 కిలోమీటర్లు ప్రయాణించాలి..



మా పొలం జూలెకల్ శివారులో ఉంది. అప్పట్లో గ్రామం నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న పొలానికి కాలినడకన వెళ్లేవాళ్లం. ఆర్డీఎస్ కెనాల్ తవ్వడంతో పొలానికి వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. 40 ఏళ్ల క్రితం ఇనుప ఛానళ్లతో కెనాల్ దాటడానికి ఉపయోగపడేది. శివాలయం మీదుగా యాపదిన్నె శివారు నుంచి నాలుగు కిలోమీటర్లు ప్రయాణించి పొలానికి చేరుకోవాల్సి వస్తోంది. ఆటో, ట్రాక్టర్ ద్వారా కూలీలను తరలించాల్సిన పరిస్థితి ఉంది. కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– రాజేంద్రప్రసాద్, రైతు, జూలెకల్

చుట్టూ తిరిగి వెళ్లాలి



మా పొలాలకు వెళ్లేందుకు అప్పట్లో ఇనుప ఛానళ్లు, రేకులతో చిన్నపాటి వంతెన ఏర్పాటు చేశారు. పచ్చర్లకు వెళ్లే బీటీ రహదారిలో ఏర్పాటు చేసిన కల్వర్టు వద్దకు వెళ్లి కెనాల్ దాటి చుట్టూ తిరిగి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. ఊరు దగ్గర్లో ఉన్న పొలానికి చుట్టూ తిరిగి పోవాల్సిన పరిస్థితులున్నాయి. కూలీలు రావడంలేదు. ఇనుప వంతెన స్థానంలో కల్వర్టు నిర్మించి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లేలా దారి ఏర్పాటు చేయాలి.

– గోవర్ధన్‌రెడ్డి, రైతు, తనగల

ప్రతిపాదనలు పంపించాం..



ఆర్డీఎస్ కెనాల్‌పై ఏర్పాటు చేసిన ఇనుప వంతెనలు ఉప్పల, తనగల, జూలెకల్ శివారుల్లో మూడు చోట్ల తుప్పుపట్టి నిరుపయోగంగా ఉన్నాయి. మూడు వంతెనలకు మరమ్మతులు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీనివాసులు, ఏఈ, ఆర్డీఎస్

అంబేడ్కర్ కళాభవన్‌కు స్థలం కేటాయించాలి

అలంపూర్: అంబేడ్కర్ కళాభవన్‌కు స్థలం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంకల భీమన్న కోరారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ భూమిని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం పరిశీలించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ అలంపూర్ చౌరస్తాలోని సర్వే నెంబర్ 250/సి ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిపారు. కొందరు బడా రియల్ వ్యాపారులు కబ్జా చేసినట్లు ఆరోపించారు. కబ్జాకు గురైన భూమి గురించి ఎమ్మార్పీఎస్ ఉద్యమం చేయడంతో అప్పటి జాయింట్ కలెక్టర్ అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. కలెక్టర్, ప్రజా ప్రతినిధులు సమగ్ర విచారణ చేసి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడానికి కృషి చేయాలన్నారు. అక్రమణకు గురవుతున్న భూమిలో అంబేడ్కర్ కళా భవన్ కోసం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు అంబేడ్కర్ కళాభవన్ భవన్ నిర్మాణానికి సహకరించాలన్నారు. భూమిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తే ఎమ్మార్పీఎస్ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎలీషా మాదిగ,ద ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శ్రీను మాదిగ, పురుషోత్తం మాదిగ, విజయ్ మాదిగ ఉన్నారు.


అంబేడ్కర్ కళాభవన్ కోసం స్థలం పరిశీలిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రిన్సిపల్ గోపిలతకు ప్రశంసాపత్రం



గట్టు: గట్టు కస్తూర్బా కళాశాల ప్రిన్సిపల్ గుంటి గోపిలత గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. కస్తూర్బా కళాశాలలో వందశాతం ఫలితాలు సాధించిన తరుణంలో రాష్ట్ర స్థాయిలో ప్రశంసాపత్రం అందించారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం 283 కస్తూర్బా కళాశాలలు ఉండగా, ఇందులో 17 కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో గట్టు కస్తూర్బా కళాశాల కూడా ఉంది. జిల్లా విద్యాధికారికి, జెండర్ సమన్వయకర్తలు, కళాశాల అధ్యాపకులకు గోపిలత కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప పడిపూజ

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద గురువారం గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పమాలధారులు పడిపూజ నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి కాలనీవాసులు తరలివచ్చారు. పూజ అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.


కొత్తకోటలో అయ్యప్ప పడిపూజకు తరలివచ్చిన భక్తులు

శోభాయమానంగా నిమజ్జనోత్సవం


గద్వాలలో నిమజ్జనోత్సవంలో డ్రమ్స్ వాయిస్తున్న వాయిద్యకళాకారులు


అలంపూర్ చౌరస్తాలో ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

గద్వాలటౌన్: 'బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అంటూ వాడవాడలా బొజ్జగణపయ్యకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలోని పలు వినాయకులను నిమజ్జనం చేశారు. షేరెల్లివీధిలో బీఎస్‌కే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జనోత్సవం కనుల పండువగా సాగింది. ప్రత్యేక వేషధారణతో యువకులు నిమజ్జనోత్సవం పాల్గొన్నారు. యువకులు, చిన్నారుల నృత్యాలు, భజనలతో ఘనంగా గణపయ్యను సాగనంపారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం

జిల్లా కేంద్రంలో గణేశ్ మండపాల వద్ద నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక బీఎస్‌కే యూత్ ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దంపతులు పూజలు నిర్వహించారు. కరాటే మాస్టర్ శ్రీహరి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గణేశ్ మండపాలలో వార్డు కౌన్సిలర్లు గణనాథునికి పూజలు చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. నృత్యాలు, కోలాటాలు, బొడ్డెమలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.


అయిజలో వినాయకుడికి పూజలు

భక్తి శ్రద్ధలతో వినాయకుడి ఉత్సవాలు

అయిజ: మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దాతలు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి సమయంలో వివిధ మండపాలవద్ద భజన మండలి సభ్యులు భక్తి పాటలను పాడారు.


అలంపూర్ చౌరస్తాలో లడ్డుతో భక్తులు

అలంపూర్ చౌరస్తాలో లడ్డు రూ.32 వేలు

అలంపూర్: జై జై గణనాథ అంటూ స్వామి వారికి విశేష పూజలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో నిమజ్జనం కనుల పండువగా నిర్వహించారు. అలంపూర్ చౌరస్తాలో గణనాథుడు నిమజ్జనానికి తరలించారు. స్వామి వారి లడ్డు వేలం పాటలో ఏడుకొండల నాయుడు రూ.32 వేలకు దక్కించుకున్నాడు. నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో నిమజ్జనానికి హాజరయ్యారు. ఈ వేలం పాటలో మధు, మనోజ్, తిరుమలేష్, కిషోర్, గౌతం, ప్రవీణ్, రమేష్, పరమేష్, వీరేష్, చరణ్, కార్తీక్, వేణుగోపాల్, కౌశిక్, రంగన్న, లోహిత్, నాని, పెప్సీ శీను, వెంకటేష్ శెట్టి, భరత్, మధు పాల్గొన్నారు.


చెన్నిపాడులో పూజలో పాల్గొన్న భక్తులు


గద్వాలలో గణేశ్‌కు పూజలు చేస్తున్న యువకులు


హనుమాన్ వేషధారణలో కళాకారుడు

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్మన్న ఇంగ్లిష్ టీచింగ్‌లో జిల్లా స్థాయిలో, మద్దిలేటి మండల స్థాయిలో ఇంగ్లిష్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన సందర్భంగా ఎంఈఓ శివప్రసాద్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాసరెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ యోగిశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను బోధించాలి



అయిజ: ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న లక్ష్మణ్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల వారు లక్ష్మణ్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

ముమ్మరంగా సభ్యత నమోదు



అయిజ: మండల కేంద్రంలోని భరత్‌నగర్ కాలనీలో గురువారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పోలింగ్ బూత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పుడు సరికొత్త రికార్డు స్థాయిలో 8 రోజులకు గాను 2 కోట్ల సభ్యత్వాలు నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ కో కన్వీనర్ కేకే రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ కో కన్వీనర్ భగత్ రెడ్డి పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి



అయిజ: రాష్ట్రంలో అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సమస్య వస్తే కళాశాల యాజమాన్యం వారికి సమాచారం ఇవ్వాలని, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు విజయేంద్ర, వినోద్, కుమార్‌గౌడ్, చక్రవర్ధన్ రెడ్డి, శ్రీను, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఎర్రవల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. రాజోళి మండల కేంద్రం నుంచి బుధవారం అర్ధరాత్రి అనుమతి లేకుండా మినీ టిప్పర్‌లో సాతర్లకు ఇసుకను తరలిస్తుండగా, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూ కోర్ట్ సిబ్బంది తనిఖీ చేసి పట్టుకున్నారు. అనంతరం టిప్పర్‌ను పీఎస్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో దోమల నివారణ కోసం మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు. 1,2 వార్డుల్లోని వీధుల్లో ఫాగింగ్ యంత్రంతో తిరుగుతూ పొగ వదిలారు. ఇటీవల దోమల ఉధృతి ఎక్కువైందని ఆయా వార్డుల ప్రజలు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. స్పందించిన అధికారులు గురువారం రాత్రి ఫాగింగ్ చేయించి నివారణ చర్యలు చేపట్టారు.

అటెన్షన్ ప్లీజ్


మానవపాడు జిల్లా పరిషత్‌లో ప్రమాదకరంగా ఉన్న పాఠశాల

ప్రమాదకరం.. పాఠశాల భవనం

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతున్నా గ్రామ స్థాయిలో అమలుకావడం లేదు. నిత్యం విద్యార్థులతో కళకళలాడే మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో దాదాపు 514 విద్యనభ్యసిస్తున్నారు. 23మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల గదులు, పైకప్పుతో పెచ్చులూడి విద్యార్థులపై పడే ప్రమాదం ఉంది. మనఊరు–మనబడి కింద పాఠశాలకు దాదాపు రూ. 80లక్షలు మంజూరైనా, కాంట్రాక్ట్ తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రమాదం సంభవించకముందే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

– ప్రశ్నించాల్సిన అధికారి పేరు : శివప్రసాద్, ఎంఈఓ, మానవపాడు
ఫోన్ నంబర్: 83098 48774

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడంతో ఆయన చిత్రపటం వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు మద్దిలేటి, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, రాంబాబు, శ్రీను, గోవింద్ ఉన్నారు.


ఉండవెల్లిలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బాలల సంరక్షణపై అవగాహన


కొండేరులో అవగాహన కల్పిస్తున్న అధికారి శివ

ఎర్రవల్లి: మండలంలోని కొండేరులో గురువారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై మాట్లాడారు. బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని వారికి పెళ్లి చేస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు టోల్‌ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. గ్రామాల్లో అనాథ పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, శ్రీనివాసరావ్, అంగన్‌వాడీలు నాగరాణి, సులోమణి, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సీబీఎస్ఈ క్లస్టర్ 7వ సౌత్‌జోన్ జోన్ అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మధుళికరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన మనోజ్‌కుమార్ అండర్–14లో, నవనీత్, వినయ్, లోకేష్, శివ, ఎండీ ఇర్ఫాన్, దిలీప్‌గౌడ్, వెంకటసాయి, చైతన్యలు అండర్–17 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు నల్గొండ జిల్లాలోని ఏకశిల అడ్వాన్స్ లర్నింగ్ పాఠశాలలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న మధుళికరెడ్డి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆత్మకూర్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెచ్ఎం వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని మూలమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, మాంసకృత్తులు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, విజయలక్ష్మి, రాణి, రఫీఖాభాను, ఖాజీయాబేగం, హసీన, మాధవి, ప్రభావతి, లక్ష్మీదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు.


మూలమళ్లలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత

11 మందికి జరిమానా

ఉండవెల్లి: మండలంలోని పోలీసుల తనిఖీలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులకు గురువారం కోర్టులో హాజరు పరుచగా 11 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా అలంపూర్ జడ్జి కవిత విధించినట్లు పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారికి హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.